క్లుప్తంగా

బాధ్యతలు చేపట్టిన న్యాయమూర్తి



కీర్తి చంద్రిక రెడ్డిని ఘనంగా సత్కరించి స్వాగతం పలుకుతున్న దృశ్యం

ఇల్లెందు: ఇల్లెందు కోర్టు న్యాయమూర్తిగా డి.కీర్తి చంద్రికరెడ్డి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన ముఖేష్ బెల్లంపల్లికి బదిలీ కాగా కొత్తగూడెం పీడీఎం కోర్టు జడ్జి బి.రామారావుకు బాధ్యతలు అప్పగించి విధుల నుంచి రిలీవ్ అయిన విషయం విధితమే. ఈ సందర్భంగా కీర్తి చంద్రికరెడ్డికి బార్ అసోసియేషన్ ఘన స్వాగతం పలికింది. అధ్యక్షుడు మామిడి సత్య ప్రకాష్, న్యాయవాదులు రవికుమార్, సూర్ణపాక సత్యనారాయణ, కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీపీలు రచిత, కె. శ్రీనివాస్, న్యాయవాదులు , గుమస్తాలు, పోలీసులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బిల్లుల సమస్య పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓకు సమస్యలను విన్నవిస్తున్న సర్పంచ్‌లు

పాల్వంచరూరల్: మండలంలోని 36 గ్రామ పంచాయతీలకు చెందిన సర్పంచ్‌లు చేసిన అభివృద్ధి పనులకు చెందిన బిల్లులు రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని పెండింగ్ బిల్లుల సమస్యను వెంటనే పరిష్కరించాలని పంచాయతీల సర్పంచ్‌లు సోమవారం ఎంపీడీఓ బి.అప్పారావు కలిసి కోరారు. దీనికి స్పందించిన ఎంపీడీఓ సమస్యలను చర్చించి త్వరలోనే పరిష్కారం చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు విజయ్‌కుమార్, రవీందర్, పద్మ, హరి, కాశమ్మ, వాసం రుద్ర తదితర సర్పంచ్‌లు ఎంపీడీఓను కలిసిన వారిలో ఉన్నారు.

నేడు బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఇల్లెందురూరల్: బీఆర్ఎస్ మండల శాఖ ఆత్మీయ సమ్మేళనం మంగళవారం మండలంలోని బొజ్జాయిగూడెం పంచాయతీ ఎస్ఎస్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్ష కార్యదర్శులు శీలం రమేష్, ఖమ్మంపాటి రేణుక తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ.. మండలంలోని పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు ఆత్మీయ సమ్మేళనానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

మహిళా రెజ్లర్లకు న్యాయం చేయాలి

ఇల్లెందురూరల్: తమకు న్యాయం చేయాలని మహిళా రెజ్లర్లు చేస్తున్న నిరసన ప్రభుత్వం విస్మరించడం దారుణమని పీఓడబ్ల్యూ రాష్ట్ర నాయకురాలు బయ్యా శారద అన్నారు. మండలంలోని కొల్లాపురం గ్రామంలో సోమవారం ఏర్పాటైన పీఓడబ్ల్యూ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. దేశానికి పతకాలు సాధించి దేశ గౌరవాన్ని చాటిన మహిళా రెజ్లర్లు తమపై లైంగిక వేధింపులు జరుగుతున్నాయని రోడ్డెక్కడంపై ప్రభుత్వం తక్షణం జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. కేవలం అధికార పార్టీ ఎంపీని కాపాడేందుకే రెజ్లర్ల ఆందోళనపై ప్రభుత్వం చిన్నచూపు ప్రదర్శిస్తోందన్నారు. ఈ సమావేశంలో నాయకులు నోముల కళావతి, కల్తి రాములమ్మ, మోకాళ్ళ సుగుణ, మల్లూరి సుగుణ, వరలక్ష్మి, చింతలాలమ్మ, భూక్య బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

హజ్ యాత్రికులకు సన్మానం



హజ్ యాత్రికులతో ఎమ్మెల్యే హరిప్రియ

టేకులపల్లి: హజ్ యాత్రకు ఎంపికైన దంపతులకు ఎమ్మెల్యే బానోతు హరిప్రియ అభినందనలు తెలిపారు. ఈ మేరకు ఇల్లెందు నియోజకవర్గం నుంచి హజ్ యాత్రకు ఎంపికైన టేకులపల్లి మండలానికి చెందిన ఎండి.సబీర్–సుబేదా బేగంలను సోమవారం క్యాంపు కార్యాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో హాజీ, నబీ, షకీల్, ఇలియాజ్, ఎం.ఏ ఖయ్యూం, జానీ, ఘాజీ, ఆజాం తదితరులు పాల్గొన్నారు.

గ్రహణం వీడేదెప్పుడో..?

నిలిచిపోయిన మల్టీయుటిలిటీ సెంటర్ నిర్మాణం

- స్లాబ్ లెవల్‌కే సరిపడిన నిధులు
- పూర్తి చేసేందుకు మరో రూ.కోటి కేటాయింపు



పనులు నిలిచిపోయిన మల్టీయుటిలిటీ సెంటర్

ఇల్లెందు: పట్టణ నడిబొడ్డున పాత సింగరేణి క్వార్టర్స్ ఏరియాలో రెండేళ్ల క్రితం శంకుస్థాపన చేసి పనులు ప్రారంభించిన 'మల్టీయుటిలిటీ సెంటర్' నిర్మాణానికి నిధుల గ్రహణం పట్టింది. 30 గుంటల స్థలంలో రూ. 1.30 కోట్లతో ప్రారంభించిన ఈ సెంటర్‌కు నిధులు సరిపోలేదు. రూ.1.30 కోట్ల వరకు పనులు పూర్తి చేసి స్లాబ్ నిర్మాణం వరకు పూర్తయ్యింది. ఇక ఫినిషింగ్, విద్యుత్, మరుగుదొడ్లు, స్నానపు గదులు, ప్రహరీ, లైటింగ్, సంప్, మోటార్లు బిగించాల్సి ఉంది. ఆరు నెలలుగా నిధులు లేక పనులు నిలిచిపోయాయి. పట్టణ నడిబొడ్డున కోట్ల రూపాయలు వెచ్చించి చేపట్టిన అభివృద్ధి పనులన్నీ నిధులు సరిపడక నిలిచిపోవటంతో వాటి లక్ష్యం నెరవేరకుండా పోతోంది. సెంటర్ నిర్మాణం పూర్తయితే సభలు, సమావేశాలతో పెళ్లిళ్లు, శుభ, అశుభ కార్యాలకు ఉపయోగంగా ఉంటుంది. పట్టణ నడిబొడ్డున ఏర్పాటు చేసిన ఈ మల్టీయుటిలిటీ సెంటర్ వల్ల పట్టణానికి కొత్త శోభ సంతరించుకోనుంది.

మరో రూ.కోటి కేటాయిస్తూ...

అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ సెంటర్‌ను పూర్తి చేసేందుకు ఇటీవల సీఎం కేసీఆర్ జిల్లాలో కలెక్టరేట్ ప్రారంభోత్సవం సందర్భంగా మున్సిపాల్టీకి మంజూరు చేసిన రూ.25 కోట్ల నిధులలో రూ.కోటి నిధులు కేటాయిస్తూ ఎమ్మెల్యే హరిప్రియ, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావులు నిర్ణయం తీసుకున్నారు. ఈ నిధులు విడుదలకు ప్రతిపాదనలు కూడా పంపారు. కలెక్టర్ నుంచి అప్రూవల్ కూడా అయ్యింది. అయితే టెండర్ నిర్వహించాల్సి ఉందని ఇంజనీరింగ్ విభాగం అధికారులు పేర్కొంటున్నారు. అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు మరో రూ.కోటి నిధులు విడుదలై టెండర్ జరిగి పనులు ప్రారంభం అయితే సకాలంలో పూర్తి చేయగలిగితే వచ్చే వేసవి నాటికి పూర్తి అయ్యే అవకాశం ఉంది. ఇప్పటికైనా వేగంగా పనులు పూర్తి చేయాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

నిరుపయోగంగా మారొద్దు..



మల్టీయుటిలిటీ సెంటర్‌కు ప్రభుత్వం కేటాయించిన నిధులు సరిపడకపోవటంతో నిర్మాణం పూర్తి చేసుకోలేకపోయింది. అసంపూర్తి భవనంలో అసాంఘిక చర్యలకు అడ్డాగా మారింది. తక్షణం నిర్మాణం పూర్తి చేసి ఉపయోగంలోకి తీసుకు రావాలి. ఫంక్షన్ హాల్, సభలు, సమావేశాలు జరుపుకునే మందిరం నిరుపయోగంగా మారొద్దు.

–లింగరాజు, ఇల్లెందు

పనులు ప్రారంభించాలి...



సెంటర్ నిర్మాణానికి గడువు పూర్తయ్యింది. అయినా పనులు మాత్రం పూర్తి కావడం లేదు. నిధులు లేవని పనులు నిలిపివేశారు. మళ్లీ నిధులు విడుదలై టెండర్ జరిగి పనులు ప్రారంభమైతే రోజులు, నెలలు గడిచే పరిస్థితి ఉంది. తక్షణమే నిర్మాణానికి అవసరమైన పద్ధతులను పూర్తి చేసి పనులు ప్రారంభించాలి.

– వి. హరీష్‌గౌడ్, ఇల్లెందు

చర్యలు ముమ్మరం చేశాం



కొంత కాలం క్రితం నిధులు లేక నిలిచిపోయింది. మల్టీయుటిలిటీ సెంటర్‌కు మంజూరైన నిధుల వరకు పనులు పూర్తి చేశారు. ఇక ఇటీవల సీఎం నిధుల నుంచి మరో కోటి కేటాయించాం. టెండర్ ప్రక్రియ పూర్తి కావాల్సి ఉంది. టెండర్ ప్రక్రియ పూర్తి అయితే వెంటనే పనులు చేపట్టి పూర్తి చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు సిద్ధంగా ఉన్నారు.

– దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, మున్సిపల్ చైర్మన్

గణేష్ టెంపుల్ రోడ్డును విస్తరించాలి



అధికారులతో మాట్లాడుతున్న రంగాకిరణ్

చుంచుపల్లి/కొత్తగూడెంఅర్బన్: గణేష్ టెంపుల్ నుంచి ప్రగతినగర్ వెళ్లే రోడ్డును పూర్తిస్థాయిలో విస్తరించాలని బీజేపీ జాతీయమీడియా ఓబీసీ సెల్ కోఆర్డినేటర్ కె.వి.రంగాకిరణ్ అన్నారు. సోమవారం గణేష్ టెంపుల్, ప్రగతి నగర్ రోడ్డు విస్తరణలో భాగంగా ఇళ్లు నష్టపోయిన స్థానికులతో కలిసి కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ రఘు నాయక్, టీపీఓ ప్రభాకర్, మున్సిపల్ ఏఈ మధులతో చర్చించారు. ఈ సందర్భంగా రంగాకిరణ్ మాట్లాడుతూ... రోడ్డు విస్తరణకు పూర్తిగా సహకరిస్తామని, కానీ మున్సిపల్ అధికారులు కొంతమందిని టార్గెట్ చేసి వారి ఇళ్లనే కూల్చడం సరికాదన్నారు. అధికారులు పారదర్శకంగా రోడ్డు విస్తరణ చేపట్టాలని మున్సిపల్ కమిషనర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో కొల్లా నర్సింహరావు, డాక్టర్ మోహన్ బాబు,ఐత ప్రకాష్, నారాయణరావు, పబ్బాతి ప్రసాద్, నాయకులు చింతలచెర్వు శ్రీనివాసరావు, సాయికిరణ్ పాల్గొన్నారు.

బెళగావి రైలు ప్రారంభంతో స్వీట్లు పంపిణీ



స్వీట్లు పంపిణీ చేస్తున్న కమిటీ సభ్యులు

కొత్తగూడెంఅర్బన్: బెళగావి రైలు ప్రారంభమై కొత్తగూడెం(బీడీసీఆర్) స్టేషన్‌కు వచ్చిన సందర్భంగా కొవ్వూరు రైల్వే లైన్ సాధన కమిటీ కన్వీనర్ కొదమసింహం పాండురంగాచార్యులు, సిటిజన్ వెల్ఫేర్ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో సోమవారం స్టేషన్ అధికారులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాండురంగచార్యులు మాట్లాడుతూ... భద్రాచలం రోడ్డు రైల్వేస్టేషన్ నుంచి డోర్నకల్ వరకు ఉన్న రైల్వే స్టేషన్లో గిరిజన ప్యాసింజర్స్ ప్రయాణించుటకు తప్పనిసరిగా గతంలో నడిచిన డోర్నకల్ ప్యాసింజర్, సాయంత్రం వేళలో నడిచిన కాజీపేట ప్యాసింజర్ తప్పనిసరిగా నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు కల్లూరు కృష్ణ, సాయి, శంకర్, పవన్‌కళ్యాణ్, శ్రీనివాస్, బాబూలాల్, రమణ, సంపత్, సుమన్ చైతన్య, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమించాలి

ఇల్లెందురూరల్: స్వాతంత్య్ర సమరయోధుడు అల్లూరి సీతారామరాజు స్ఫూర్తితో ఉద్యమించాలని ప్రజాపంథా పార్టీ మండల కార్యదర్శి పూనెం కుమార్ అన్నారు. మండలంలోని పోలారం గ్రామంలో అల్లూరి సీతారామరాజు వర్ధంతిని ప్రజాపంథా ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీరాం కోటయ్య, మెడెం రాంబాబు, వజ్జ వీరభద్రం, బండి నారాయణ, వల్లోజు చంద్రశేఖర్, పులుసు కిరణ్, సత్యనారాయణ, ఇర్ప కృష్ణ, శ్రీరాం సురేష్, జూకంటి అనంతచారి, ఇర్పా రామచుక్కయ్య, ఈసాల బాబు, మూతి హరికృష్ణ, నాగేందర్ తదితరులు పాల్గొన్నారు.

సభకు తరలిన నాయకులు

ఇల్లెందు: హైదరాబాద్‌లోని సరూర్ నగర్ స్టేడియంలో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ భరోసా సభకు ఇల్లెందు నుంచి కాంగ్రెస్ నేతలు, యువకులు తరలివెళ్లారు. సోమవారం నియోజకవర్గంలోని పలు మండలాలు, పట్టణం నుంచి భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. పట్టణ, మండల అధ్యక్షులు డానియేల్, పులి సైదులు, నాయకులు చీమల వెంకటేశ్వర్లు, డాక్టర్ జి. రవి, జీవీ భద్రం, జలీల్, శంకర్, కాయం రమేష్, ఈశ్వర్‌గౌడ్ ఉన్నారు

రిటైర్డ్ జీఎంకు అవార్డు



ఆనందరావుకు అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

కొత్తగూడెంరూరల్: సింగరేణి సంస్థలో సేవలు అందించిన రిటైర్డ్ జీఎం అందెల ఆనందరావుకు హైదరాబాదులోని ట్యాంకు బండ్ వద్ద పీపుల్స్ ఎడ్యుకేషన్ క్లబ్‌లో గడ్డం వెంకటస్వామి స్మారక మండలి ఆధ్వర్యంలో బెస్టు మేనేజ్మెంట్ అవార్డు ప్రదానం చేశారు. సింగరేణి సంస్థలో కార్మికుల సంక్షేమంతోపాటు, వారి సమస్యలు పరిష్కారం, సింగరేణి అభివృద్ధిగాను, సామాజిక సేవ రాణించినందుకు గాను బెస్టు మేనేజ్మెంట్ అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో గడ్డం వెంకటస్వామి స్మారక మండలి చైర్మెన్ గొల్లపల్లి దలయానందరావు, అంబేద్కర్ సంక్షేమ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మద్దెల శివకుమార్, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ విష్ణుమూర్తి, అంబేద్కర్ సేన రాష్ట్ర అధ్యక్షుడు మల్లు శివరాం, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శ్రమశక్తి అవార్డు గ్రహీతకు సన్మానం



రాధాకృష్ణను సన్మానిస్తున్న సీఈ ప్రభాకర్‌రావు

పాల్వంచ: తెలంగాణా స్టేట్ పవర్ ఎంప్లాయిస్ యూనియన్(1535) సెంట్రల్ కమిటీ ప్రధాన కార్యదర్శి డి.రాధాకృష్ణ మేడే రోజు శ్రమశక్తి అవార్డును అందుకోవడంపై కేటీపీఎస్ 5, 6 దశల సీఈ ఎం.ప్రభాకర్ రావు సన్మానించారు. సోమవారం స్థానిక సీఈ కార్యాలయంలో శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జెన్‌కో అధ్యక్షుడు పి.రాము, జెన్‌కో అదనపు ప్రధాన కార్యదర్శి శ్రీధర్, అంబాల శ్రీనివాసరావు, సాంబయ్య, నర్సిరెడ్డి, యుగంధర్, అల్లాడి పుల్లారావు, రహీం పాషా, మాలోతు నాగేశ్వరరావు, జి.యల్లయ్య పాల్గొన్నారు.

ధాన్యం పరిశీలన

పాల్వంచరూరల్: మండల పరిధిలోని రెడ్డిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రంలో అనేక రోజులుగా ధాన్యం నిల్వచేసిన కొనుగోలు చేయకుండా జాప్యం చేస్తున్నారని పలువురు రైతులు సోమవారం కలెక్టర్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు డీసీఓ ఎన్. వెంకటేశ్వర్లు, తహసీల్దార్ రంగాప్రసాద్ సోమవారం కొనుగోలు కేంద్రంలో నిల్వచేసిన ధాన్యాన్ని పరిశీలించారు. నిబంధనల మేరకు తేమశాతం ఉన్న ముగ్గురు రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేయాలని సొసైటీ కార్యదర్శి శ్రీను ఆదేశించారు. తహసీల్దార్ వెంట రూరల్ ఆర్ఐ హచ్చా ఉన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె

తమ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె సోమవారం కొనసాగింది. ఈ సందర్భంగా పలు పార్టీల నాయకులు తమ సంఘీభావం తెలిపారు. పలుచోట్ల సమావేశాలు నిర్వహించి తమగోడు వెళ్లబుచ్చారు.

– సాక్షి నెట్‌వర్క్



ఇల్లెందురూరల్: దీక్ష చేస్తున్న వీఓఏలు



సింగరేణి(కొత్తగూడెం): వీఓఏల నిరసనకు మద్దతు తెలిపి మాట్లాడుతున్న నాయకులు



పాల్వంచరూరల్: దీక్షా శిబిరం వద్ద రౌండ్ టేబుల్ సమావేశం

పేద ప్రజల ఆరోగ్యమే లక్ష్యం



ఉపకేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వనమా

కొత్తగూడెంరూరల్: లక్ష్మీదేవిపల్లి మండలం శ్రీనగర్ గ్రామ పంచాయతీలో 16 లక్షల రూపాయలతో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. పేద ప్రజల మెరుగైనా వైద్య సేవలు అందించేందుకు కెసీఆర్ ఎన్నలేని కృషి చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌రావు, ఎంపీపీ భూక్యసోనా, సొసైటీ చైర్మన్ మండె హనుమంతరావు, ఉర్దూగర్ కమిటీ చైర్మన్ అన్వర్‌పాషా, సర్పంచ్ పూనం నాగేశ్వరరావు, ఉప సర్పంచ్ లగడపాటి రమేష్, డైరెక్టర్ శేషాద్రి వినోద్ పాల్గొన్నారు.

దరఖాస్తులను పరిష్కరించాలి



సిబ్బందితో మాట్లాడుతున్న ఆర్డీఓ స్వర్ణలత

ఇల్లెందురూరల్: ఇల్లెందులో జీవో నెం.76 దరఖాస్తులను వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆర్డీఓ స్వర్ణలత ఆదేశించారు. తహసీల్దార్ కృష్ణవేణితో కలిసి మండలంలోని బాలాజీనగర్ గ్రామపంచాయతీలో గల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని సోమవారం ఆర్డీఓ సందర్శించారు. కార్యాలయంలో జీఓ నెం.76కు సంబంధించి పెండింగ్‌లో ఉన్న . దరఖాస్తుల వివరాలను పరిశీలించారు. లబ్ధిదారులను పిలిపించైనా త్వరితగతిన రిజిస్ట్రేషన్లు జరిగేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ స్వర్ణలత స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. పట్టణంలో ఇప్పటివరకు 1,172 దరఖాస్తులు వచ్చాయని అందులో 841 దరఖాస్తులు ఆమోదం పొందగా 331 దరఖాస్తులు తిరస్కరించబడ్డాయన్నారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంకా 11 దరఖాస్తులు రిజిస్ట్రేషన్ కాకుండా పెండింగ్‌లో ఉన్నాయన్నారు.

కార్మికుల సౌకర్యాలు విస్మరించారు



మాటాడుతున్న రియాజ్ అహ్మద్

సింగరేణి(కొత్తగూడెం): కొత్తగూడెం ఏరియా పరిధిలోని సమంత సీహెచ్‌పీని సింగరేణి యాజమాన్యం వందల కోట్ల రూపాయలను వెచ్చించి నిర్మించారు కానీ వాటి నిర్వహణ లోపం కారణం తరుచు బ్రేక్ డౌన్ అవుతుందని హెచ్ఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ ఆరోపించారు. సోమవారం సమంతా సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ... 11వ, వేజ్‌బోర్డ్ కాలయాపనకు కొన్ని జాతీయ కార్మిక సంఘాలే ప్రధాన కారణమన్నారు. సమంతా సీహెచ్‌పీలో కార్మికులకు కనీస సౌకర్యాలు లేని విషయం తెలిసి యాజమాన్యాన్ని నిలదీయాల్సిన కార్మిక సంఘాలు నోరుమెదపటం లేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు, కార్మికులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడదాం..



నార సంచులు పంపిణీ చేస్తున్న జీఎం

ఇల్లెందు: పర్యావరణ పరిరక్షణ కోసం పాటుపడాల్సిన బాధ్యత మనందరి మీద ఉందని, ఆ దిశగా ప్రయత్నం చేయాలని సింగరేణి ఏరియా జీఎం షాలేమురాజు అన్నారు. సోమవారం ఇల్లెందులోని జీఎం కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పర్యావరణ పరిరక్షణ కోసం నార సంచులను పంపిణీ చేశారు.

కారుణ్య నియామకాలకు ముఖాముఖి

సింగరేణి ఇల్లెందు ఏరియా జీఎం షాలేమురాజు ఆదేశాల మేరకు సోమవారం ఎస్ఓటూ జీఎం కార్యాలయంలో మెడికల్ ఇన్వాలిడేషన్ అయిన ఇద్దరు ఉద్యోగుల వారసులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు సోమవారం ముఖాముఖి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఓటూ జీఎం మల్లారపు మల్లయ్య, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్ రావు, అధికారుల సంఘం అధ్యక్షుడు పంజాల శ్రీనివాస్, ఎనియర్ పర్సనల్ ఆఫీసర్ సాయి స్వరూప్, డీజీఎం ఫైనాన్స్ బి. రామచంద్ర, ఎస్ఈ సివిల్ ఆదినారాయణ, డీవైసీఎం పర్సనల్ జి. శ్రీహరి, అసిస్టెంట్లు రవి, పప్పి, ప్రజ్వల, గుర్తింపు సంఘం ఉపాధ్యక్షుడు ఎస్. రంగనాథ్ పాల్గొన్నారు.

గ్రామాల్లో కంటి వైద్య పరీక్షలు



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

జూలూరుపాడు: రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతున్నట్టు జూలూరుపాడు పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాకేష్ కుమార్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. సాయిరాంతండాలో ప్రారంభం కాగా, కొమ్ముగూడెం, పడమటనర్సాపురం గ్రామాల్లో కంటి వైద్యశిబిరాలు కొనసాగుతున్నాయన్నారు. 18 ఏళ్లు పైబడి వారు కంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ మనోజ్, డాక్టర్ పూజ,హెచ్ఎస్ రత్నకుమార్, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

36 పంచాయతీల్లో ఆరుగురు కార్యదర్శుల విధులు

టేకులపల్లి: జూనియర్ పంచాయతీ కార్యదర్శులు గత నెల 28 నుంచి నిరవధిక సమ్మె చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామాల్లో పరిపాలన కుంటు పడకుండా అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశారు. టేకులపల్లి మండలంలో మొత్తం 36 పంచాయతీలకు ఆరుగురు రెగ్యులర్, 30 మంది జేపీఎస్‌లు ఉన్నారు. 30 మంది జేపీఎస్‌లు సమ్మె చేస్తుండటంతో మిగిలిన రెగ్యులర్ కార్యదర్శులు ఆరుగురికి 30 గ్రామ పంచాయతీల బాధ్యతలు అప్పగించినట్లు ఎంపీఓ గణేష్ గాంధీ తెలిపారు.

బాస్కెట్‌బాల్ క్యాంప్ ప్రారంభం



క్యాంప్ ప్రారంభిస్తున్న సీనియర్ క్రీడాకారులు

పాల్వంచ: పట్టణంలోని కేటీపీఎస్ కాలనీలో గల బాస్కెట్ బాల్ ప్రాంగణంలో సోమవారం బాస్కెట్ బాల్ సమ్మర్ క్యాంప్‌ను డాక్టర్ యుగంధర్ రెడ్డి, సీనియర్ ఆల్ ఇండియా ప్లేయర్ వైటీఎం కె.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సమ్మర్ క్యాంప్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్తమ క్రీడాకారులుగా ఎదగాలన్నారు. కోచ్ గడ్డం విజయ్ రామ్ ఆధ్వర్యంలో 45 విద్యార్థులను తీర్చిదిద్దడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాకేశ్, నాగరాజన్, రాజ, చెక్రీ, షారూక్, సలీం, ప్రణీత్; బషీర్, సీనియర్ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అధికారుల నిర్లక్ష్యం.. రైతులకు శాపం

- బంద్రుగొండలో మొలకెత్తిన ధాన్యం



తహసీల్దార్ రంగాప్రసాద్‌కు మొలకెత్తిన ధాన్యాన్ని చూపిస్తున్న రైతులు

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోళ్లల్లో అధికారులు జాప్యం చేయడం రైతులకు శాపంగా మారిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలపరిధి బంద్రుగొండ గ్రామంలో 20 రోజులుగా ధాన్యం కొనుగోలును ప్రారంభించకుండా సొసైటీ అధికారులు నిర్లక్ష్యంగా వహరించడం అకాల వర్షాలకు కల్లంలో ఆరబోసిన ధాన్యం తడిసి మొలకలు వచ్చాయని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మొలకేత్తిన ధాన్యాన్ని సోమవారం బాధిత రైతులు భద్రయ్య, వెంకయ్యలు తహసీల్దార్ రంగాప్రసాద్‌కు చూపించారు. దీనికి స్పందించి తహసీల్దార్ ధాన్యాన్ని కొనుగోలు చేసేవిధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దంతలబోరు, రెడ్డిగూడెం కొనుగోలు కేంద్రాల్లో రైతులు 20 రోజులుగా ధాన్యాన్ని నిల్వచేసినా సంబంధిత అధికారులు కొనుగోలు ప్రక్రియను ప్రారంభించకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ మేరకు బంద్రుగొండలో తడిసి మొలకెత్తిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలుచేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా జిల్లా నాయకులు నిమ్మల రాంబాబు సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.